సాక్షి జగిత్యాల
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



నృసింహుని సన్నిధిలో జేడీ పూజలు

ధర్మపురి: శ్రీలక్ష్మినృసింహస్వామిని గురువారం ల్యాండ్ అక్విజేషన్ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులు దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాస్ శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.



జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

జగిత్యాలజోన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతిని ఎస్పీ అశోక్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.4/28.6

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి



పద్మావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మహిళా న్యాయవాదులు

జగిత్యాలజోన్: కక్షిదారుల కేసులు సత్వరం పరిష్కరించి న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. పద్మావతికి జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కోర్టు బెంచ్‌కు న్యాయవాదులు సహకరించాలని న్యాయమూర్తి కోరారు. పెండింగ్ కేసుల సంఖ్యను వీలైనంతమేర తగ్గించేందుకు ప్రయత్నిద్దామన్నారు. జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, సబ్ జడ్జి శర్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, మొదటి, రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు జితేందర్, వినీల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి దురదృష్టకరం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జగిత్యాల:జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి దురదృష్టకరమని, హంతకులను ఉపేక్షించవద్దని, కఠినంగా శిక్షించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి మోతెలోని పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు జ్యోతి, గిరి నాగభూషణం, హన్మండ్లు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరణ్

కథలాపూర్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని డీఆర్డీవో రఘువరణ్ సెర్ప్ సిబ్బందికి సూచించారు. మండలంలోని దూలూర్, తాండ్ర్యాల, బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. తేమశాతం పరిశీలించి వెంటనే తూకం వేయించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం నరహరి, సీసీలు విజయనిర్మల, రాజేందర్ ఉన్నారు.

ఒకే విద్యార్థి.. ఏడుగురు సిబ్బంది



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈనెల 20 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా.. గురువారం గణితం పరీక్ష జరిగింది. ఉదయం రెగ్యులర్, మధ్యాహ్నం సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్ష కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే రాయగా.. ఏడుగురు సిబ్బంది విధులు నిర్వర్తించారు.

మెట్‌పల్లి మున్సిపల్ బడ్జెట్ రూ.22.85కోట్లు

మెట్‌పల్లి: 2025–26 ఆర్థి సంవత్సరానికిగాను మెట్‌పల్లి బల్దియా రూ.22కోట్ల 85లక్షల 94వేలతో రూపొందించిన బడ్జెట్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆమోదించారు. ప్రారంభ నిలువ రూ.13.29లక్షలు, అంచనా ఆదాయం వివిధ గ్రాంట్స్‌తో కలుపుకొని రూ.22కోట్ల 72లక్షల 65వేలతో బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో వేతనాలకు రూ.4.65కోట్లు, శానిటేషన్ నిర్వాహణకు రూ.కోటి 29లక్షల 60వేలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.కోటి 3లక్షలు, కరెంట్ బిల్లులకు రూ.1.80కోట్లు కేటాయించారు.

ఒకే ఇల్లు.. ఒకే వంట

బలం.. బలగం

- ఇంటి పెద్ద మాటకు కట్టుబడి
- బంధాలు, బంధుత్వాలకు విలువనిస్తూ
- ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

సాక్షి స్పెషల్ స్టోరీ

ఉమ్మడి కుటుంబం.. జీవిత పాఠం.. అలాంటి కుటుంబాల్లో భావోద్వేగాలకు..ఆప్యాయతలకు చోటుంటుంది. ఏది మంచో.. ఏది చెడో బాల్యం నుంచే చిన్నారులకు చెప్పే వారుంటారు. నీతి కథలు.. పెద్దల అనుభవాలు జీవిత పాఠాలుగా ఉపయోగపడుతాయి. ఏ ఆపదొచ్చినా.. ఒకరికొకరు సాయం చేసుకుంటూ మేమున్నామనే భరోసా ఉంటుంది. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో బంధాలు, బంధుత్వాలు భారమవుతున్నాయి. పెళ్లయిన కొన్నాళ్లకే వేరు కాపురాల సంఖ్య పెరుగుతోంది. ఎప్పుడో ఓసారి కలిసినప్పుడు నామమాత్రపు పలకరింపులు.. తర్వాత ఎవరి దారి వారిదే.. ఇలాంటి రోజుల్లో కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉంటున్నారు. అలాంటి వారిపై ‘సాక్షి’ స్పెషల్ స్టోరీ..

– కోరుట్ల/సారంగాపూర్/యైటింక్లయిన్‌కాలనీ వేములవాడ/ముత్తారం/మల్యాల



భీమనాతి కుటుంబ సభ్యులు

భీమనాతి బలగం

తరతరాలుగా ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా కాలం గడుపుతూ ఆదర్శంగా నిలుస్తుంది. ఈ కుటుంబం కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్‌లో నివాసముంటోంది. కుటుంబ పెద్ద భీమనాతి కాంతయ్య–గంగుబాయి దంపతులకు ఒక కుమార్తె, ఆరుగురు కుమారులు. భీమనాతి శ్రీనివాస్, వేణుగోపాల్, జనార్దన్, శ్రీధర్, దామోదర్, సాయికృష్ణ. కాంతయ్య ఇటీవల మృతిచెందినా ఆయన కొడుకులు తల్లి గంగుబాయితో కలిసే ఉంటున్నారు. వారసత్వంగా వస్తున్న ఐరన్‌హార్డ్‌వేర్ వ్యాపారంలో వీరంతా స్థిరపడ్డారు. వీరందరికీ పెళ్లిళ్లు కావడంతో పాటు పిల్లలు ఉన్నారు. తల్లి గంగుబాయితో కలిసి కొడుకులు–కోడళ్లు, మనుమలు, మనమరాళ్లు అంతా 27 మంది ఉన్నారు. వీరంతా ఒకే ఇంట్లో ఉండటమే కాదు.. ఒకే వంట కావడం విశేషం. రోజూ చిన్నపాటి ఫంక్షన్ తీరుగా ఇల్లంతా పెద్దలతో పాటు పిల్లాపాపలతో కళకళలాడుతుంది. తరతరాలుగా ఈ కుటుంబం ఉమ్మడిగా కాలం గడపటం నిజంగా ఈ కాలంలో ఓ వింతగానే తోస్తోంది.

- వివరాలు 10లో ▸

ఎక్కడి పనులు అక్కడే..

- నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిన పనులు
- ఏళ్ల తరబడి ముందుకు సాగని వైనం
- వసతులు లేక ప్రజలకు తప్పని తిప్పలు



- ఈచిత్రంలో కనిపిస్తున్నది సమీకృత మార్కెట్ భవనం. వెజ్, నాన్‌వెజ్ విక్రయాలు అన్నీ ఒకేచోట సాగేలా ఖాదీ ప్రతిష్టాన్‌కు చెందిన స్థలంలో మూడేళ్ల క్రితం దీనిని నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర క్రితం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.



- ఇది పట్టణంలోని బీడీ కాలనీలో నిర్మిస్తున్న షాదీఖానా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో దీనికి అవసరమైన స్థలం కేటాయించారు. తర్వాత 2022లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.60లక్షలు మంజూరు చేసింది. కానీ ఇంతవరకు పనులు పూర్తి కాలేదు.



ఇది ప్రభుత్వాసుపత్రి నూతన భవనం. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో రెండేళ్ల క్రితం చేపట్టారు. ముగింపు దశకు చేరుకున్న భవనం పనులు ఏడాది క్రితం నిలిచిపోయాయి. అప్పటి నుంచి అవి ముందుకు సాగడం లేదు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పలు అభివృద్ధి పనులు నత్తేనయమన్నట్లుగా సా..గుతున్నాయి. ఎంతో ఆర్భాటంగా మొదలు పెట్టిన పలు పనులు.. అర్ధాంతరంగానే నిలిచిపోయాయి. తిరిగి వాటిని పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా ఈ పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. వీటిని పూర్తి చేసే విషయంలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు రాక..నిధులు సరిపోక..

- మౌలిక వసతులను కల్పించడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసింది.
- ఆ నిధులతో చేపట్టిన సమీకృత మార్కెట్, షాదీఖానా, ప్రభుత్వాసుపత్రి, జూనియర్ కళాశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, వ్యవసాయ మార్కెట్‌ల భవనాల పనులు కొంతవరకు పూర్తయ్యాయి.
- వీటిలో కొన్నింటికి సంబంధించి బిల్లులను నాటి ప్రభుత్వం నుంచి రాకపోవడం.. మరికొన్నింటికి కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేసినట్లు తెలిసింది.
- అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించలేదు. దీనివల్ల ఆ పనులు ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇంకా పూర్తి కావడం లేదు.

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే సంజయ్


- పెండింగ్‌లో ఉన్న పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పలుమార్లు అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకపోయారు.
- సమీకృత మార్కెట్‌తో పాటు ఆసుపత్రి, విద్యా సంస్థల భవనాల పనులు నిధుల కొరత వల్ల చాలా కాలంగా నిలిచిపోయాయని, వెంటనే వాటికి నిధులను మంజూరు చేసి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.
- కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ ఒక్కదానికి కూడా నిధులను మంజూరు చేయకపోవడం గమనార్హం.

వసతులు లేక తప్పని తిప్పలు

- ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రి నిర్వహిస్తున్న పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు అందులో ఉన్న గదులు సరిపోక సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- కూరగాయల విక్రయాలకు ప్రత్యేకంగా మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు రహదారులకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లోనే అమ్మకాలు జరుపుతూ వస్తున్నారు.
- ఉర్దూ ఉన్నత పాఠశాల కొత్త భవన పనులు పూర్తి కాకపోవడం వల్ల ప్రాథమిక పాఠశాలలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు సరిపోక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.
- షాదీఖానా పూర్తయితే పేద ముస్లింలు శుభకార్యాలు, ఇతరత్రా జరుపుకోవడానికి ఎంతో ఉపయోగపడుతోంది. కానీ ఇది పూర్తికాక ఏళ్లుగా వారికి నిరాశే ఎదురవుతోంది.

మామిడి మార్కెట్‌లో అవకతవకలు

- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలి
- డీఎంవోను ప్రాసిక్యూట్ చేయాలి
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలటౌన్: మార్కెటింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మార్కెటింగ్ శాఖ కనుసన్నల్లో జరగాల్సిన ఓపెన్ యాక్షన్ ట్రేడర్ల ఇష్టారాజ్యంగా మారిందని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ట్రేడర్ల చేతిలో రైతులు నష్టపోతున్నా పట్టించుకోని జిల్లా మార్కెటింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని, పదేళ్లకుపైగా ఇక్కడే ఉంటున్న అతడిని వెంటనే బదిలీ చేయాలని సూచించారు. మామిడి రైతులు నష్టపోతున్నా నిబంధనలు అమలు చేయడంలో విఫలమవుతున్న సదరు అధికారిని విచారణ చేపట్టాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. సూట్ పేరుతో 5శాతం తరుగు, రాట్ గ్రేడింగ్ పేరుతో మరో 5శాతం దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షించినట్లుగానే మామిడి కొనగోళ్లపైనా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. ప్రతి ట్రేడర్ బహిరంగ వేలం ద్వారానే మామిడి కొనాలన్న మార్కెటింగ్ శాఖ నిబంధన అమలు చేయాలన్నారు. 4శాతానికి కంటే ఎక్కువ మార్కెటింగ్ ఫీజు వసూలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, రాజేందర్, రాజేందర్, మహ్మద్ భారీ, మన్సూర్, గుంటి జగదీశ్వర్, రఘువీర్‌గౌడ్, మధు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు



- 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గురువారం భానుడు తన ఉగ్రరూపం చూపించాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 44 నుంచి 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 26 నుంచి 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకే పరిస్థితి నెలకొంది. ఎండపల్లి మండలం మారేడుపల్లిలో అత్యధికంగా 44.9 డిగ్రీలు, గొల్లపల్లి, మల్లాపూర్, మల్లాపూర్ మండలం రాఘవపే ట, వెల్గటూర్‌లో 44.8, బీర్‌పూర్ మండలం కొల్వాయి, బుగ్గారం మండలం సిరికొండలో 44.7, ధర్మపురి మండలం జైన, ఇబ్రహీంపట్నం గోధూర్‌లో 44.6, పెగడపల్లి, కోరుట్ల మండలం అయిలాపూర్, సారంగాపూర్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్ చొప్పున నమోదయ్యాయి.

భూభారతితో సాదాబైనామాలకు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సత్య ప్రసాద్, చిత్రంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

- కలెక్టర్ బి.సత్యప్రసాద్

మల్యాల: భూ భారతి చట్టంతో సాదాబైనామాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో భూభారతి చట్టంపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి అవగాహన కల్పించారు. చట్టంలోని వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెండింగ్ సాదాబైనామాల పరిష్కారానికి భూభారతి చట్టం సెక్షన్–6 కింద ఆర్డీవోలకు బాధ్యతలు అప్పగించిందన్నారు. అధికారులు ఇచ్చిన ఆర్డర్లపై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పీల్ చేసుకునే అవకాశముందన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ చేపట్టి, రికార్డుల్లో మ్యుటేషన్ చేస్తారని, నిర్ణీత గడువులోగా పూర్తిచేయకుంటే ఆటోమెటిక్‌గా పూర్తవుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతితో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీఓ స్వాతి, ఏఎంసీ చైర్మన్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అనంతరం కలెక్టర్ నూకపల్లి, బల్వంతాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనాలన్నారు.

భూభారతి చట్టంతో రైతులకు మేలు

జగిత్యాల: భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ అన్నారు. భూభారతి చట్టంపై కొడిమ్యాల మండలం పూడూరులో అవగాహన కల్పించారు. ఏ సమస్యలైనా ఇక్కడే పరిష్కరించుకోవచ్చని సూచించారు.

ఉగ్రవాదుల వెన్నులో వణుకుపుట్టాలి



ధర్మపురిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: జమ్మూకాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన వారి ఆత్మ శాంతించాలంటే ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టేలా కేంద్రప్రభుత్వ చర్యలు ఉండాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సంతాప సభ ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నామన్నారు. ఉగ్రవాదుల దాడిలో 28 మంది మృతి చెందడం.. మరో 20 మంది వరకు గాయపడడం కలచివేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో ఏ ఒక్క టెర్రరిస్టు కూడా దేశం వైపు కన్నెత్తి చూసే సాహసం చేయకుండా కేంద్రం చర్యలు చేపట్టాలని, అందుకు అండగా ఉంటామని వివరించారు. నాయకులు వేముల రాజు, చీపిరిశెట్టి రాజేశ్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, కుంట సుధాకర్, గడ్డం భాస్కర్‌రెడ్డి, సింహరాజు ప్రసాద్ ఉన్నారు.

‘మత్తు’తో నైతిక విలువల పతనం

- ఎస్పీ అశోక్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: మత్తు పదార్థాల వినియోగంతో నైతిక విలువలు పతనం అవుతున్నాయని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పొలాస వ్యవసాయ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత మత్తుబారిన పడొద్దని సూచించారు. ఏకాగ్రత, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సైదా నాయక్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కార్యక్రమం కో–ఆర్డినేటర్ పర్లపల్లి రాజు, సీఐలు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించాలి

జగిత్యాలక్రైం: సమస్యలు వస్తే పరిష్కారం దిశగా ఆలోచించాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మానసిక నిపుణులు అశోక్‌కుమార్ మానసిక ఆరోగ్య అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మానసికంగా ఆరోగ్యం ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది వివిధ మానసిక ఒత్తిళ్లపై అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, సీఐలు కిరణ్‌కుమార్, వేణు, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, రఫీక్‌ఖాన్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి శవమై..



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

జగిత్యాలక్రైం: తన నానమ్మ కర్మకాండ చేసేందుకు వెళ్లి చింతకుంట చెరువులో గల్లంతైన నీలి మల్లికార్జున్ (30) శవమై తేలాడు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ బుధవారం ఉదయం తన నానమ్మ కర్మకాండ చేసేందుకు చింతకుంట శ్మశాన వాటికకు వెళ్లాడు. కర్మకాండ పూర్తయిన తర్వాత చెరువులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. గురువారం ఉదయం శవమై కనిపించాడు. మృతుడి తల్లి మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల(చొప్పదండి): మండలంలోని కొండగట్టు ఘాట్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (75) కనిపించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ముత్యంపేట కారోబార్ రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి



మధు మృతదేహం

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ శివారు ఎల్లమ్మ గుడి సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై దత్తాద్రి, గ్రామస్తుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన బేతి మధు (30) గుల్లపేటలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తిరిగి బాలపల్లి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో గులపేటకు చెందిన జగదీష్, రాజిరెడ్డి పొరండ్ల వెళ్లి బైక్‌పై గుల్లపేటకు వెళ్తున్నారు. ఎల్లమ్మ ఆలయం వద్ద మధు, జగదీశ్ వాహనాలు ఢీకొనడంతో మధు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజిరెడ్డి, జగదీశ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జగదీశ్ పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

సిరిసిల్లక్రైం: కుటుంబ అవసరాల కోసం ఆన్‌లైన్ షాపింగ్ చేసేందుకు ప్రయత్నించగా రూ.2లక్షలు మోసపోయారు. ఈ మేరకు సిరిసిల్లటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన పూస శ్రీనివాస్ తన గృహ అవసరాల కోసం ఆన్‌లైన్‌లో కొన్ని వస్తువులను కొనేందుకు క్రెడిట్‌కార్డ్ నంబర్లను ఎంటర్ చేశాడు. సీవీఈవ పిన్ ఎంటర్ చేయగానే కార్డులో ఉన్న డబ్బులు తన ఆధీనంలో లేకుండానే పోవడం గమనించాడు. ఇలా రూ.2లక్షలు ఖాతా నుంచి పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒకే ఇల్లు.. ఒకే వంట

బలం..బలగం

- ఇంటిపెద్ద మాటకు కట్టుబడి
- బంధాలు, బంధుత్వాలకు విలువనిస్తూ
- ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

ఉమ్మడి కుటుంబమంటే కొండంత బలం. ఏ ఆపదొచ్చినా ఒకరికొకరు సాయం చేసుకుంటూ మేమున్నామనే భరోసా ఉంటుంది.. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో బంధాలు, బంధుత్వాలు భారమవుతున్నాయి. పెళ్లయిన కొన్నాళ్లకే వేరుకుంపటి వ్యవస్థ పెరుగుతోంది. ఎప్పుడో ఓసారి కలిసినప్పుడు నామమాత్రపు పలకరింపులు.. తర్వాత ఎవరిదారి వారిదే.. అయినా కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇంటి పెద్దల మాటకు కట్టుబడి, విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉంటున్నారు. ఉమ్మడి కుటుంబమే కొండంత అండా అన్నట్టు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– కోరుట్ల/సారంగాపూర్/యైటింక్లయిన్‌కాలనీ/వేములవాడ/ముత్తారం/మల్యాల



అర్జున్-భీమక్క మనువలు, మనువరాళ్లు

రెండు దశాబ్దాలుగా..



రాజేశం-జయలక్ష్మి కుటుంబం

రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన బైరి రాజేశం–జయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అందరికి పెళ్లిళ్లయ్యాయి. కొడుకులు, కోడళ్లు, వారి పిల్లతో కలిసి రెండు దశాబ్దాల నుంచి ఉమ్మడిగానే ఉంటున్నారు. అంతా కలిసి పండుగలను సంతోషంగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్ద కుమారుడు నాగరాజు, ఎమ్మెస్సీ బీఎడ్ చదివి ప్రైవేట్ టీచర్‌గా పని చేశారు. కరోనాతో స్కూల్ మూతపడడంతో ప్రస్తుతం యైటింక్లయిన్‌కాలనీలో నాగరాజు అండ్ బ్రదర్స్ అనే పేరుతో కిరాణం షాపు పెట్టుకుని ముగ్గురన్నదమ్ములు నాగరాజు, ప్రవీణ్‌కుమార్, సుమన్‌కుమార్ చుసుకుంటున్నారు. ఉమ్మడిగా కలిసి ఉంటేనే ఆనందం ఉంటుందని రాజేశం పేర్కొన్నారు.

అత్తాకోడళ్లు కాదు.. తల్లీకూతుళ్లు



చెల్పూరి వారి ఉమ్మడి కుటుంబం

రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన చెల్పూరి రాజమ్మ– రాములుది ఆదర్శ ఉమ్మడి కుటుంబం. నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. అనోన్యత చాటే తోడికోడళ్లు. అత్త సారథ్యంలో కుటుంబ నిర్వహణ. తల్లీకూతుళ్ల వలె కలిసిమెలిసి ఉంటారు. వైషామ్యాలకు తావులేకుండా పండంటి కా పురాలుగా తీర్చిదిద్దుతున్నారు తోడికోడళ్లు సరిత, అంజలి, గాయత్రి, అంజలి. సరిత భర్త ఓదెలు, అంజలి భ ర్త గట్టయ్య, గాయత్రి భర్త రాజమౌళి, అంజలి భర్త లింగమూర్తి. అన్నదమ్ములందరూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరి ఉమ్మడి కుటుంబంలో ఎనిమిది మంది పిల్లలు సాయితేజ, సిందూజ, అమూల్య, అక్షిత, రేవంత్, రుత్విక్, రిషిత, కార్తికేయ. ఇక ఆడబిడ్డలు శంకరమ్మ– శంకరయ్య, లక్ష్మీకాంత– రవి. వారి కుటుంబాలతో కలిసి ఉంటున్నారు. ఆడబిడ్డ కుమారుడైన లవకుమార్‌కు సింధూజతో వివాహం జరిగింది. ఆడబిడ్డలు, కూతురు వస్తే ఆ ఇంట్లో పండుగే. నలుగురు తోడికోడళ్లను చూసి ఆదర్శవంతమైన కుటుంబం అని గ్రామస్తులు కితాబునిస్తారు.

ఇంటిపెద్ద మాటే వేదం



అర్జున్-భీమక్క కొడుకులు, కోడళ్లు

జగిత్యాల పట్టణానికి చెందిన కొండేరి అర్జున్–భీమక్క దంపతులకు ఐదుగురు కుమారులు, కుమార్తె. పెద్ద కొడుకు, కోడలు గంగాధర్–శారద. గంగాధర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. రెండో కొడుకు, కోడలు వేణుగోపాల్–అన్నపూర్ణ. వేణుగోపాల్ ప్రైవేటు జాబ్. మూడో కొడుకు, కోడలు రాము–సమత. రాము భవన నిర్మాణ రంగంలో పనిచేస్తుంటాడు. నాల్గో కుమారుడు, కోడలు దేవదాసు–భాగ్యలక్ష్మి. ఇతను తన తండ్రి అర్జున్ ఏర్పాటు చేసిన హోటల్ నిర్వహిస్తున్నాడు. ఐదో కొడుకు, కోడలు రాజేందర్–సంధ్య. ఈయన సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్. వీరందరికీ ఒకే ఒక్క ఆడపడుచు నవ్వాతు శోభ, బావ రవి. ఇతను మృతిచెందాడు. కోడళ్లు ఐదుగురు ఇంటి సేవలకే పరిమితమై ఇప్పటికీ అత్తామామల మాట జవదాటరు. వారి ఇంటికి ఆడబిడ్డ వచ్చిందంటే అన్నదమ్ములకు ఎనలేని సంతోషం. ప్రతి ఒక్కరూ తమ వృత్తుల్లో వస్తున్న ఆదాయాన్ని తండ్రికి ఇవ్వడం విశేషం. ఐదుగురు అన్నదమ్ముల మధ్య ఏనాడు బేదాభిప్రాయాలు రాలేదు. అర్జున్–భీమక్కకు మనుమలు, మనుమరాళ్లు మొత్తం 38 మంది. తాము ఇప్పటికీ సంతోషంగా ఉన్నామంటే తమ కొడుకుల మధ్య ఏనాడు చిన్న విభేదాలు పొడసూపలేదని, తాము చెప్పిందే వారికి వేదమన్న విధంగా నడుస్తున్నారని పేర్కొన్నారు. అందరూ కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణతో ఉండడం మాకు కొండంత బలాన్ని ఇస్తుందని, వారి పిల్లలు కూడా కలిసి ఉంటున్నారని అర్జున్–భీమక్క చెప్పుకొచ్చారు.

ఉప్పల జాయింట్ ఫ్యామిలీ



తల్లి జయలక్ష్మితో కొడుకులు, కోడళ్లు, మనువలు, మనువరాళ్లు

వారిది నిరుపేద వైశ్య కుటుంబం. అయినా బంధాలు, బంధుత్వాలను గౌరవిస్తారు. ముందు నుంచి హోటల్ నడుపుకుంటూ జీవించే వసుధైక కుటుంబం. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. పెంకుటింట్లో ఇరుకైన గదుల్లోనే వీరంతా ఉంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్‌వీధిలో ఉంటున్న ఉప్పుల శ్రీరాములు– జయలక్ష్మి దంపతులకు నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు. కొడుకులు, కోడళ్లు కలిసే ఉంటున్నారు. ఇందులో శ్రీరాములు ఇటీవలే మరణించారు. వీరితోపాటు ఇద్దరు కూతుళ్లు ఇక్కడే ఉంటున్నారు. మిగతా ఐదుగురు కూతుళ్లు తమ తమ అత్తావారిళ్లలో ఉంటున్నారు. ఈ ఉమ్మడి కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఈ ప్రాంతానికే ఆదర్శంగా నిలుస్తున్నారు.

సమష్టి కృషి

నాకు 13 ఏళ్లకే పెళ్లయింది. నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు చేశాం. ఇప్పటి వరకు ఉమ్మడిగానే ఉంటున్నాం. కుటుంబ సభ్యులమంతా సమష్టిగా కృషి చేస్తూ కాలం వెల్లదీస్తున్నాం. చిన్నపాటి ఇళ్లయినా అనురాగాలు, ఆప్యాయతల మధ్య సంతోషంగా గడుపుతున్నాం. ఇప్పటికీ నా కొడుకులు, కోడళ్లు మా మాటను జవదాటరు. ఉమ్మడి కుటుంబంతో ఎన్నో లాభాలు ఉంటాయి. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనువలు, మనుమరాళ్లు, మునిమనువలు మొత్తం 44 మంది అయ్యాం. కానీ, నేటి తరం పెళ్లి కాగానే తల్లిదండ్రులను పట్టించుకోకుండా వేరు సంసారాలు పెడుతున్నారు. ఇది మన సంప్రదాయం కాదు.

– ఉప్పల జయలక్ష్మి, కుటుంబ పెద్ద

అందరూ ఒకే ఇంట్లో..



అట్ల భూమవ్వ కుటుంబం

మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలోని అట్ల భూమవ్వ–అర్జయ్య దంపతులకు ఇద్దరు కుమారులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి. తండ్రి కొద్ది రో జుల క్రితం మృతిచెందాడు. అ న్నదమ్ములు ఎవరి పనులు వారు చే సుకుంటూ ఒకే ఇంట్లో ఉంటారు. తిరుపతిరెడ్డి–గాయత్రి దపంతులకు ఇద్దరు కుమారులు అభినయ్, కార్తీక్‌రెడ్డి. శ్రీనివాస్‌రెడ్డి– సంధ్యకు ఇద్దరు కుమారులు అక్షిత్, జశ్వంత్. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. 15 ఎకరాల వ్యవసాయ భూమిని ఉమ్మడిగానే సాగు చేస్తున్నారు. పిల్లల చదువులుసైతం ఉమ్మడిగానే భరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రోజూ పండుగే..

నా కొడుకులు ఎవరి పనులకు వారు వెళ్తారు. కోడళ్లు ఇంటి, వ్యవసాయ పనులు చేసుకుంటూ, అందరం కలిసిమెలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాం. నాకు చేతనైనంత ఇంటి పనుల్లో సాయం చేస్తుంటా. కొడుకులు, కోడళ్లు, మనుమళ్లతో కలిసి ఉంటే రోజూ పండుగ వాతావరణం ఉంటుంది.

– అట్ల భూమవ్వ, తాటిపల్లి



బూడిద తొలగిస్తున్న కార్మికుల బృందం



పునరుద్ధరణ పనులు చేపడుతున్న కార్మికులు



అధికారులకు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబాలు

పగిలిన బూడిద పైప్‌లైన్ పరిశీలన

- ఇళ్లలో నిండిన బూడిద తొలగింపు
- అధికార, విపక్ష పార్టీల మధ్య వాగ్వాదం

రామగుండం: పట్టణంలోని అక్బర్‌నగర్ పక్కన పగిలిన బూడిద పైప్‌లైన్‌ను గురువారం ఎన్టీపీసీ సీఎస్ఆర్ హెచ్ఆర్ సిగ్దర్ నేతృత్వంలో అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించింది. పైపులైన్‌తో పాటు బూడిద నిండిన గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి గృహాలు, రహదారులు, డ్రైనేజీల్లో నిండిన బూడిదను కార్మికులతో తొలగించే పనులు చేపట్టారు. భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు ఎన్టీపీసీ అధికారుల వైఖరిపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశారు. చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాలపై అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించారు. బూడిదతో నిండిన గృహాలను గుర్తించి వారికి పక్కా గృహాలు నిర్మించాలని, నష్టపోయిన వస్తువులకు నష్టపరిహారం చెల్లించాలని, పైపులైన్ పక్క నుంచి రిటైనింగ్ వాల్ నిర్మించి గృహాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఎన్టీపీసీ అధికారుల వెంట అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు బోయ వెంకట్, గుండేటి సంధ్యారాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయోధ్యసింగ్‌ఠాకూర్, ఆసిఫ్‌పాషా, సంగణవేణి శేఖర్, ఇఫ్తాకార్ అహ్మద్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార, విపక్షాల పోటీ

అక్బర్‌నగర్‌లో పైపులైన్ బాధిత కుటుంబాల పరామర్శలో గురువారం అధికార, విపక్ష పార్టీల మధ్య పోటీ నెలకొంది. ఓ దశలో ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో భద్రత బలగాలను రప్పించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ స్థానికంగా లేకపోవడంతో ఆయన సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు అయోధ్యసింగ్, మాజీ కౌన్సిలర్ అంజులు తమ అనుచర వర్గంతో బాధిత కుటుంబాల కాలనీకి చేరుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ కాంట్రాక్టు కార్మిక సంఘం నేత కౌశిక హరి నేరుగా బాధిత కుటుంబాలను కలిసి వారికి భరోసా కల్పిస్తూ ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులకు ఫోన్ చేయగా అప్పటికే వారు మార్గమధ్యలో ఉండగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్ తన అనుచవర్గంతో అక్కడికి చేరుకున్నారు. సీఆర్ఎస్ అధికారులు నేరుగా అధికార పార్టీ నేతల వద్దనే ఉండటంతో విపక్ష నేతలు క్షేత్రస్థాయి పరిశీలనకు రావాలని కోరగా వారికి ఎలాంటి స్పందన లేదు. దీంతో అధికార, విపక్ష నేతల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. సీఎస్ఆర్ అధికారి పోలీసు బందోబస్తు మధ్య వాహనంలో వెళ్లేందుకు యత్నించగా విపక్ష నేతలు వాహనం వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో ఎట్టకేలకు ఏదో మొక్కుబడిగా గృహాలను పరిశీలించి అధికారి వెనుదిరిగారు.

బాధితులకు తాత్కాలిక జీవన భృతి పరిహారం పంపిణీ

ఎన్టీపీసీ యాష్‌పాండ్ సమీపంలోని బూడిద పైపు పగిలిన ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు గురువారం సీఎస్ఆర్ అధికారి సిగ్దర్ నేతృత్వంలో వందశాతం నష్టపోయి ఆశ్రయం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి తాత్కాలిక జీవన భృతి కింద రూ.10వేలు అందజేశారు. జీవన భృతి స్వీకరించిన వారిలో తాజ్ అలీబేగ్, ఖదీరా, ఖలీల్‌పాషా, మహ్మద్ ఖైరున్నీసా తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శి కథ సుఖాంతం

- సిరిసిల్లకు చేరిన కార్యదర్శి ప్రియాంక
- టౌన్ పోలీస్ స్టేషన్‌లో హాజరు



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ప్రియాంక

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ నాయకుల వేధింపులతో అదృశ్యమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక కథ సుఖాంతమైంది. మూడు రోజుల క్రితం లేఖరాసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ప్రియాంక ఆచూకీ కడప జిల్లాలో లభ్యమవడంతో కుటుంబ సభ్యులు పోలీసుల సాయంతో బుధవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా గురువారం ఉదయం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ప్రియాంక తనగోడును పోలీసుల ఎదుట వెల్లబోసుకుంది. ఇప్పటికే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. దర్యాప్తు జరుగుతోంది. ప్రియాంక మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు క్రీదాది మల్లేశ్‌బాబు, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ మూలంగా తాను మానసిక క్షోభకు గురైనట్లు పేర్కొంది. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి కారణంగా పంచాయతీ కార్యదర్శి అదృశ్యం అవడంపై స్టేట్ ఇంటలిజెన్స్ అధికారులు రిపోర్టు తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు తెలుస్తోంది. సదురు కాంగ్రెస్ నాయకుల తీరుపై కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తలనీలాలకు మళ్లీ టెండర్

- ఆరోసారి హాజరైన ఇద్దరు కాంట్రాక్టర్లు
- రూ.14.01 కోట్లకు బహిరంగ వేలం
- కమిషనర్‌కు నివేదిక
- ఆమోదిస్తే ఓకే.. లేకుంటే మళ్లీ టెండర్

వేములవాడ: రాజన్నకు భక్తులు సమర్పించుకునే తలనీలాలను సేకరించుకునే హక్కు రెండేళ్ల కోసం నిర్వహించిన టెండర్ ఈనెల 11తో ముగిసింది. టెండర్ కాలపరిమితి ముగియకముందే ఆలయ అధికారులు నాలుగు దఫాలుగా టెండర్లకు ఆహ్వానించారు. ఈలోగా టెండర్ పూర్తి కాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. టెండర్ తేదీ పూర్తికావడంతో ఈనెల 11న టెండర్ నిర్వహించారు. రూ.13.67 కోట్లతో ఆన్‌లైన్ టెండర్‌దారుడు హెచ్చుపాటదారుడిగా ఎంపికయ్యాడు. దీన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆమోదించకపోవడంతో గురువారం మళ్లీ టెండర్ పిలిచారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్‌లలో ఎవరూ హాజరుకాలేదు. బహిరంగ వేలంపాటలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఎల్లయ్య (కళావతి ఎంటర్‌ప్రైజేస్, సికింద్రాబాద్), భూమేశ్వర్‌రావు(శ్రీవల్లభ ఎంటర్ ప్రైజేస్, సికింద్రాబాద్)లు హాజరయ్యారు. ఇందులో రూ.14,01,30,009 కోట్లకు కళావతి ఎంటర్‌ప్రైజేస్ హెచ్చుపాటదారుడిగా ఎంపికయ్యాడు. గత టెండర్‌తో పోలిస్తే రూ.5కోట్ల మేర తక్కువగా ఉండడంతో ఆమోదం కోసం కమిషనర్‌కు నివేదిక ఇచ్చినట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 12 నుంచి ఆలయ అధికారులు అదనపు సిబ్బందిని, అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తలనీలాలను సేకరిస్తున్నారు. టెండర్ నిర్వహణ పూర్తయ్యే వరకు ఆలయ అధికారులు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఒకే రోజు ఆరు అగ్నిప్రమాదాలు



శాతవాహనలో ఎగిసిపడుతున్న మంటలు, కాలి బూడిదవుతున్న చెట్లు



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

- శాతవాహనలో పెద్ద ఎత్తున మంటలు
- రాత్రి వరకు సేవలందించిన నాలుగు స్టేషన్‌ల ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: జిల్లాలో మొత్తం ఆరు అగ్నిప్రమాదాలు సంభవించాయి. వెంటవెంటనే జరిగిన ఆరు అగ్ని ప్రమాదాలు ఫైర్ అధికారులను ఊపిరిపీల్చుకోనివ్వలేదు. మండుటెండలకు విపరీతమైన వేడితో గుర్తు తెలియని వ్యక్తులు పడేసిన అగ్నితో శాతవాహనలో అగ్నిమంటలు చెలరేగగా వెంటనే అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులే ఫైర్ అధికారులకు ఫోన్ చేశారు. డివిజన్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కరీంనగర్ ఫైరింజిన్ శాతవాహన యూనివర్సిటీకి చేరుకొని మంటలను ఆర్పే పనిలో నిమగ్నమవగా గాలికి మంటలు ఎక్కువ అవడంతో మానకొండూర్ నుంచి ఫైరింజిన్‌ను పిలిపించారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్ అధికారులు రాజ్‌కుమార్, భూదయ్యలు సిబ్బందితో కలిసి రాత్రి వరకు శాతవాహనలో పొగలురావడంతో అక్కడే ఫైరింజన్‌ల సహాయంతో సేవలు అందించారు.

● ఇవే మంటలకు చెందిన పొగలు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు రావడంతో అప్రమత్తమైన ట్రైనీ ఐపీఎస్ వసుంధరాయాదవ్ ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే చేరుకొని అక్కడ విధులు నిర్వహించి మంటలు ఎగిసిపడకుండా చర్యలు చేపట్టారు. ఈప్రమాదంలో శాతవాహనలో వివిధ రకాల చెట్లు కాలిపోయాయి.

● పద్మనగర్‌లోని వ్యవసాయ కేంద్రం వెనుక నుంచి ప్రారంభమైన మంటలు యూనివర్సిటీ వైపు రావడంతో అక్కడి వైపు నుండి కూడా పొగమంటలు పెద్ద ఎత్తున రావడంతో వేములవాడకు చెందిన ఫైర్ ఇంజన్ పిలిపించారు.

● శాతవాహన యూనివర్సిటీ గేటువద్ద ఒక సానిటరీ షాపులో షాట్‌సర్క్యూట్ తో మంటలు చెలరేగాయని వెంటనే యూనివర్సిటీలో సేవలందిస్తున్న మానకొండూర్ ఫైర్ ఇంజన్‌ను పంపించి అక్కడ మంటలను ఆర్పారు.

● కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం వద్ద గల ఐటీ టవర్ వెనక ప్రాంతంలో మంటలు చెలరేగడంతో స్థానికులు ఫోన్ చేయగా చొప్పదండి ఫైర్ ఇంజన్ తెప్పించి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు.

● నాగులమల్యాలలోని ఇండ్ల పక్కన గల ఖాళీ ప్రదేశంలో మంటలు చెలరేగడంతో వేములవాడ ఫైర్ ఇంజిన్‌తో మంటలు ఆర్పారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న గడ్డం ఆంజనేయులును అరెస్ట్ చేసి రెండు వాహనాల(టీవీఎస్ ఎక్సెల్)ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. జగిత్యాల పట్టణ శివారులోని ధరూర్‌కు చెందిన కొత్తపల్లి లక్ష్మీ, నర్సింగాపూర్‌కు చెందిన కడార్ల నర్సింహా ఇటీవల తమ ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం ధరూర్ శివారులో రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపడుతుండగా.. జిల్లాకేంద్రంలోని వాణీనగర్‌కు చెందిన గడ్డం ఆంజనేయులు పట్టుబడ్డాడు. అతనిని అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కోరుట్ల: పట్టణ శివారులోని రైల్వేస్టేషన్‌లో గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం గంజాయిని మహారాష్ట్రలోని నాందేడ్‌లో కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తున్నారనే సమాచారంతో పోలీసులు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన గాజుల లిఖేష్, మరో బాలుడు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకోగా.. వారి వద్ద 164 గ్రాముల గంజాయి లభ్యమైంది. నాందేడ్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కథలాపూర్, కోరుట్ల, కోరుట్ల మండలంలోని పరిసర గ్రామాల్లో విక్రయిస్తూ జల్సాల కోసం డబ్బులు సంపాదిస్తున్నట్టు నిందితులు విచారణలో వెల్లడించారని ఎస్సై తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపించామన్నారు. గంజాయి విక్రేతల సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్ బాబు ఎస్సై శ్రీకాంత్‌ను అభినందించారు.

కండుపులోంచి రెండు కిలోల కంతీ తొలగింపు

- జీజీహెచ్‌లో మెరుగైన శస్త్ర చికిత్స



కంతి

కోల్‌సిటీ(రామగుండం): తీవ్రమైన కడుపునొప్పి, రక్త స్రావంతో తల్లడిల్లుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఓ మ హిళకు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యబృందం మెరుగైన శస్త్రచికిత్సలు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఆపరేషన్ చేయడం రిస్క్ అని తెలిసీ కూడా గురువారం ఆ మహిళకు ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. గైనిక్ విభాగం ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం.. 10 రోజుల క్రితం పాలకుర్తి మండలం ఎల్కపల్లికి చెందిన హేమలత కడుపునొప్పి, రక్తస్రావంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చింది. అడ్మింట్ చేసుకొని పరీక్షించిన వైద్యులు గర్భసంచిలో కంతీ ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు అప్పటికే రెండు పెద్దా పరేషన్లు కూడా జరిగాయి. ఇలాంటి రిస్క్ కండీషన్‌లో పేషెంట్‌కు ఆపరేషన్ చేయడం సవాల్‌గా మారింది. యూరాలజిస్టు నిషాంత్, సర్జన్ దామెర అనిల్‌కుమార్ తొలత అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, ప్రొసిజర్లు పూర్తి చేసిన అనంతరం పేషెంట్‌కు గురువారం గైనిక్ హెచ్ఓడీ అరుణ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీదేవి, అనస్తీషియా నిపుణులు ప్రశాంత్ తోపాటు మిగితా వైద్య బృందం జ్యోతి, శ్రవంతి సక్సెస్‌గా ఆపరేషన్ నిర్వహించారు. ఆమె కడుపులోంచి రెండు కిలోల బరువు ఉన్న కంతీని తొలగించారు. ఆపరేషన్ చేసిన వైద్య బృందాన్ని సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అభినందించారు.

యువకుడి హంగామా

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని పోచమ్మవాడలో కొందరు గురువారం సాయంత్రం మద్యంమత్తులో గొడవపడ్డారు. ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వకుండానే తనపై గొడవపడిన వారిని మందలించాలని పోలీసులను కోరగా నిరాకరించారు. దీంతో యువకుడు వెంట తెచ్చుకున్న డీజిల్ ఒంటిపై పోసుకుని హంగామా సృష్టించాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని స్నానం చేయించి వదిలిపెట్టారు.